

కథ


రంగనాథం పార్కుకి వెళ్లేసరికి ఆ మిగతా ముగ్గురూ ఓ మూల సిమెంట్ బెంచీ మీద కూర్చుని వున్నారు. సూర్యుడు పడమటి కొండల్లో విశ్రాంతి తీసుకోవడానికి ఆయత్తమవుతున్నాడు. ఆకాశంలో ఆ దిక్కున కుంకుమ ఆరబోసినట్లుంది. అయిదున్నరకు అటో ఇటో ఆ నలుగురూ ఆ బెంచీ మీదకు చేరుకుంటారు. నలుగురూ వేరు వేరు చోట్ల ఉద్యోగాలు చేసి ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రభాకరరావు, మూర్తి ఇద్దరూ పక్కపక్క ఇళ్లవాళ్లు కలిసే వస్తారు. ''ఈ రోజు నేను తొందరగా వెళ్లిపోవాలి. అసలు రాకూడదనే అనుకున్నాను. కానీ ఆరునెలలుగా వస్తున్నానుగా, టైము అయ్యేసరికి కాళ్లు ఇటు పయనమయ్యాయి'' అన్నాడు మూర్తి. ''మా కోడలు ఆనపకాయ తెమ్మంది'' ఎందుకు తొందరగా వెళ్లాలో కారణం చెప్పారు.

# కాశీయాత్ర



సమ్మా నిత్యకళ్యాణమ్మ





వాళ్ల పిల్లలు బుద్ధిమంతులు. తల్లిదండ్రుల మీద గౌరవం వున్నందువలన వృద్ధాశ్రమంలో చేరవలసిన అవసరం ఏ ఒక్కరికీ రాలేదు. వాళ్లు మాట్లాడుకోవడానికి విషయాలకేం కొదవలేదు. రాజకీయాల జోలికి వెళ్లరని కాదు. అయితే ఆ విషయాల గురించి పెద్దగా చర్చించరు. జీవితంలో వారి వారి అనుభవాలను మాత్రం చెప్పుకుంటారు.

''మీలో ఎవరైనా కాశీకి వెళ్లారా?'' ప్రశ్నించాడు చలపతి. అతను ఆ విషయం ఎందుకెత్తాడో మూర్తికి అర్థం కాలేదు. బహుశా తన కాశీ యాత్ర విషయం చెప్పాలనుకుంటున్నాడేమో అనుకున్నాడు మూర్తి.

''నేను ఉద్యోగం చేస్తున్నంత కాలం తీర్థ యాత్రలకు వెళ్లడం కుదరలేదు. మీరు నాకు పుస్తె కట్టేరా? లేక ఆఫీసుకి పుస్తె కట్టేరా? అని సాధించేది నా భార్య. నిజం చెప్పాలంటే నేను కాశీయే కాదు తిరుపతి కూడా వెళ్లలేదు'' అన్నాడు మూర్తి.

''నాకు భాష రాదు. అందుకే ఉత్తర భారత యాత్రలకు వెళ్లలేదు. అయితే తిరుపతి నాలుగైదు సార్లు వెళ్లి వుంటాను'' అన్నాడు ప్రభాకర రావు. అలా అడిగింది చలపతి కాకుండా వేరెవరో అయి వుంటే వెళ్లానో, లేక వెళ్లలేదు అనో ముక్తసరిగా చెప్పి వుండేవాడు. ఆయన చాలా పరిమితంగా మాట్లాడతాడు.

చలపతి ఎలా చెప్పాలా? ఏమని చెప్పాలా? అని ఓ క్షణం ఆలోచించాడు. ''ఇప్పుడు నా వయస్సెంత వుందో, నా చిన్నప్పుడు మా నాయనమ్మ వయసు అంత వుండేది. నేను ఆరేళ్లవాడిననుకుంటాను.'' వాళ్ల స్పందన ఎలాగుంటుందోనని వాళ్ల ముఖాలు చూశాడు. చలపతి టూకీగా చెప్తాడు కదా అని మూర్తి ''నీ చిన్ననాటి ముచ్చట చెపుతున్నావా? తొందరగా చెప్పు'' అన్నాడు.

''మూర్తీ! ఇంటి నుంచి బయలుదేరుతూ ఆనపకాయ కొనాలన్నావు.''

''ఔను! ఆనపకాయకు కాశీయాత్రకు ఏమిటి సంబంధం? నువ్వు అక్కడ ఆనపకాయ వదిలేశావా?''

సూర్యుడు తన డ్యూటీ పూర్తి చేసి అస్తమించాడు. సంధ్య రంగప్రవేశం చేసింది. మసక వెలుతురులో ఒకరి ముఖాలు వేరొకరికి కనిపించడం లేదు. పార్కులో దీపాలు ఇంకా వెలగలేదు.

''మా నాయనమ్మకు కాశీ వెళ్లాలన్న కోరిక ఆమె పెళ్లి అయిన దగ్గర్నించి వుండేదట. ఆమె పెళ్లి పదహారేళ్లకే జరిగింది. మా తాతగారి సంపాదన అంతంత మాత్రం. పైగా ప్రయాణ సౌకర్యాలు ఈ రోజుల్లో లాగా లేవు.''

మూర్తికి అసహనంగా వుంది. వినాలనీ వుంది. కోడలు పురమాయించిన పని అతడ్ని తొందర పెడుతోంది. ఆ మాటే అన్నాడు.

''మూర్తి నువ్వు అడ్డం వస్తే ఎలా?'' రంగనాథం అన్నాడు.

''మా నాయనమ్మకు పాతిక సంవత్సరాలు నిండక ముందే మా తాతగారు చనిపోయారు. అప్పటి కామెకు నలుగురు పిల్లలు. మా నాన్నగారే పెద్ద. అత్తవారు స్థితిమంతులు కాదు. కోడల్ని, ఆమె పిల్లల్ని తమతో పాటు వుండడానికి ఒప్పుకోలేదు. మా నాయనమ్మ తల్లిదండ్రులకు పుట్టెడు దుఃఖంతో వున్న కూతుర్ని అక్కున చేర్చుకోవాలని వున్నా వారి కోడలు సుతరామూ వీలుకాదంది. నారు పోసిన వాడు నీరు పోస్తాడంటారు. తమ కొలువులో పని చేసే శాస్త్రులు గారు చనిపోతే వారు మా తాతగారు వుంటున్న ఇంటిని నాయనమ్మకు ధారాదత్తం చేయడమే కాక కొంత పైకం కూడా ముట్టజెప్పారు. నాయనమ్మ ఆ డబ్బుని పెట్టుబడిగా పెట్టి అప్పడాలు, వడియాలు లాంటివి చేసి వాటిమీద వచ్చే డబ్బుతో పిల్లల్ని పెంచింది.''

''నువ్వు చెప్పేదానికి ఇంత ఉపోద్ఘాతమా?'' మూర్తి మళ్లీ అడ్డు తగిలాడు.

''నీకు తొందరైతే వెళ్లు'' ప్రభాకరరావు అన్నాడు. మూర్తి లేవనూ లేదు. మాట్లాడనూ లేదు.

''మీ నాయనమ్మ గుండె నిబ్బరాన్ని మెచ్చుకోవాలి. పిల్లల్ని చదివించింది. పెళ్లిళ్లు చేసింది కదూ. ఆమె తన రెక్కల కష్టం మీద'' అన్నాడు ప్రభాకరరావు.

''నీవు ఊహించింది నిజమే. ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసింది. మా నాన్నగార్కి రాజుగారి కొలువులో పెద్ద ఉద్యోగమే దొరికింది''

''రాజుగారి కొలువులోనా? అప్పటికి రాచరికాలు అంతరించాయే. స్వతంత్ర భారతదేశంలో సంస్థానాలూ, రాజ్యాలు ఎక్కడున్నాయి? అన్నీ దేశంలో విలీనమైపోయాయే'' అన్నాడు మూర్తి.

''ఆ మాట నిజమే. రాజ్యాలు లేవు కానీ వాళ్లను అప్పటికీ ప్రజలు రాజులుగానే భావించేవారు. ప్రభుత్వం వారికి ప్రీవీ పర్సుల రూపేణా ఏటికేడాది డబ్బు ఇచ్చేది. పైగా వారికి భూములు, పాడి పశువులు, చిన్న చిన్న కర్మాగారాలు, బోలెడన్ని ఇళ్లు, అద్దెలు. ఈనాడు ఒక కలెక్టరాఫీసులో ఎందరు ఉద్యోగులుంటున్నారో అంతకు రెట్టింపు ఉద్యోగులు వారి దగ్గర పనిచేసేవారు. అదిగో మళ్లీ మా నాయనమ్మకు కాశీ వెళ్లాలన్న కోరిక కలిగింది. బాధ్యతలు లేవు. ఆ విశ్వనాథుని, అన్నపూర్ణను దర్శించడం, పవిత్రగంగలో స్నానం చేయడం ఒక్కటే ఆమె కోరిక. 'నాయనా! నాకు కాశీ వెళ్లాలని వుంది' అంటూ కొడుకుతో అనేది మానాయనమ్మ గారు. ఏదో సాకు చెప్పేవారట. 'ఏమండీ! అత్తగారు అంతగా ప్రాధేయపడుతున్నారు ఆవిడ కోరిక తీర్చడం మీ కర్తవ్యం' అంటూ మా అమ్మ అనేదిట. 'అమ్మకు కాశీయాత్ర చేయించాలని నాకు మాత్రం తెలియదా? మనం అందరం కలిసి వెళ్లాలని అనుకుంటున్నాను. దానికవసరమైన డబ్బు జతపడడం లేదు' అనేవారట మా నాన్నగారు.

''ఏం? ప్రభుత్వ ఉద్యోగులకు అడ్వాన్సులు ఇచ్చేటట్లు దివాణంలో ఆ సౌకర్యం లేదా?'' అడిగాడు ప్రభాకరరావు.

''ఉండేదట. అడ్వాన్సు తీసుకోవడం అంటే అప్పు చేయడమే కదా? మా నాన్నగారికి అప్పు చేయడం సుతరాము ఇష్టంలేదు.''

''బాగుంది వరస. ఎంత చిట్టు అమ్మితే నూకడి పెళ్లవుతుంది అంటారు. అలా ఎన్నాళ్లు పొదుపు చేస్తే సపరివారంగా కాశీకి వెళ్లగలరు? అంటే మీ నాయనమ్మ గారి కోరిక తీరలేదంటావు. ఆమాట చెప్పడానికి ఇంత పడుగు పేకానా? నేను వస్తాను'' లేచాడు మూర్తి.

అప్పటికి వాళ్లు ఇళ్లకు వెళ్లిపోయే సమయం కూడా అయింది. ఇంతలో పార్కులో దీపాలు వెలిగాయి. ''మీకు వినే ఓపిక లేకపోతే ఇళ్లకు పోదాం పదండి'' అన్నాడు చలపతి.

''చలపతి! నువ్వు ఈ వృత్తాంతాన్ని ఆనపకాయతో మొదలుపెట్టావు. అసలు నువ్వు వేసిన ప్రశ్న ఏమిటి? చెప్తున్నదేమిటి? మూర్తి మాట వదిలేస్తే మాకు ఇంటి దగ్గర రాచకార్యాలేమున్నాయి. నువ్వు చెప్పు నేనూ ప్రభాకరరావు వింటాము'' అన్నాడు రంగనాథం.

''మా కోడలు నాకు ఏనాడూ పని పురమాయించలేదు. అందుకే నేను తొందరపడుతున్నాను. చలపతి మరో అయిదు పది నిమిషాల్లో ముగిస్తానంటే నేనూ వుంటాను'' అన్నాడు మూర్తి.

''వీడు తన బొందెలో ప్రాణం వున్నంత వరకు కాశీకి తీసుకు వెళ్లడు అని అనుకుంది నాయనమ్మ. ఒంటరిగానే వెళ్లాలనుకుంది. ఆరోజు నుంచి కాణీ పరకా దాచడం మొదలుపెట్టింది. 'ఒరేయ్ చంటీ మధ్యాహ్నం మీ అత్త వెళ్లిపోతూ నీకు అయిదు రూపాయలిచ్చింది. అందులో నాలుగు రూపాయలు నాకు ఇస్తావా?' అని నన్ను అడిగింది. 'నువ్వు నాలుగు రూపాయలిస్తే పప్పుండలు కొనుక్కోవడానికి అణా ఇస్తాను' అంది. అలా అప్పుడు ఆమె నన్ను బుట్టలో వేసుకుందని నాకు తెలియలేదు. నాలుగు రూపాయలిచ్చి అణా తీసుకున్నాను సంతోషంగా. మా చెల్లిల్ని అలాగే అడిగింది. అది గడుసుది. రూపాయకి పదహారణాలొస్తాయి. నేనెందుకిత్తాను అందట. రోజూ అందరూ పడుకున్న తరువాత డబ్బులు లెక్క వేసుకునేది. ఓ రోజు నా కంట పడింది. ''నాయనమ్మా, మన దొడ్లో కాసిన ఆనపకాయలు, బీరకాయలు, అరటికాయలు అమ్మ ఇరుగు పొరుగులకు ఫ్రీగా ఇస్తుంటే, నువ్వు డబ్బు ఎందుకు తీసుకుంటున్నావు?'' అని అడిగాను.



నాయనమ్మ అటూ ఇటూ చూసింది. మేం ఇద్దరం తప్ప మరొకరక్కడ లేరు. ''ఒరేయ్ చంటీ నువ్వెవరికీ చెప్పనని మాటిస్తే నీకో రహస్యం చెప్తాను'' అంది. అలాగేనన్నాను నేను. నాయనమ్మ అంటే నాకు వల్లమాలిన ప్రేమ. ''నేను కాశీకి వెళదామనుకుంటున్నానురా. అందుకు డబ్బులు కావాలిగా. అందుకే కాణీ కాణీ కూడబెడుతున్నాను. ఇప్పటికి అరవై రూపాయలయ్యాయి. రేపే నేను కాశీ వెళుతున్నాను'' అంది. కాశీ అంటే నాకు బోధపడలేదు. మా ఇంటికొచ్చే ముసలాయన తరచూ కాసి కాసి అంటాడు. బుగత గారు పొలం కాసిమెళ్లారా, పెరటి కాసి మెళ్లారా? అని అమ్మనడు గుతారు. నాయనమ్మ ఎటు కాసి వెళుతోందో మరి? ఆ రాత్రి మా నాయనమ్మ మూటా ముల్లె సర్దుతోంది. అందులో చిన్న ఆనపకాయ వుంది. దాన్ని నేను చూసాను. బాగా వాడిపోయింది. ఇదెందుకు నాయనమ్మా అని అడిగాను. కూర కూరా, అక్కడ కూర వండుకోనా అంది. ఇది బాగా వాడిపోయింది. నేను మరో కాయకోసియ్యనా? అని అడిగేను. ఔనురా చంటి దీన్ని కోసి ఆరు రోజు లైంది. ఇప్పుడు చీకటి పడిందిగా, రేపు ఉదయం కొయ్యి. అన్నట్లు మరో పని కూడా చేసి పెట్టు అంది. ఏమిటని అడిగాను. అన్నీ అమిరాయి కానీ బియ్యం లేవురా. డబ్బాలో వున్నాయి. తీసితేనా? కాదురా నాకు అడ్డెడు బియ్యం కావాలి. అందులోంచి తీస్తే మీ అమ్మకు తెలుస్తుంది. రూపాయి ఇస్తాను. ఉదయం కోమటి కొట్టు నుంచి కొనుక్కురా అంది. నాయనమ్మ ప్రయాణం వీధికాసి, పెరటి కాసి కాదు. ఈ కాసి ఎటుందో? పెద్ద ప్రయాణమే. జట్కాలో వెళుతుందా? బస్సులోనా? నాయనమ్మ బాగా ముసలిది. తోడు వెళ్లాలనిపించింది. అమ్మో అమ్మ నన్ను పంపిస్తుందా? ఆ మాట అమ్మకు చెప్తే, ఏమౌతుంది. ఎవరికీ చెప్పనని నాయనమ్మ ఒట్టు వేయించుకుందే.

మర్నాడుదయం ఆనపకాయ కోసాను. దుకాణంకి వెళ్లి బియ్యం తెచ్చాను. రూపాయిలో ఒక అణా మిగిలింది. బిళ్లలు కొనుక్కోరా డబ్బులు మిగిలితే అంది. అదే చేశాను. చంటీ, అమ్మ ఒంటిగంటకు పడుకుంటారు. అప్పుడే నేను బయలు దేరుతాను. ఈలోగా ఎవరి చెవిలోనూ ఊదేయకు అంది.

నాయనమ్మ రెండు మూటలు కట్టింది. అందులో ఏమేమి ఉన్నాయో నాకు తెలుసు. నాకో అనుమానం వచ్చింది. ఆనపకాయ వుంది కానీ, తరగడానికి కత్తిపీట లేదు. ఆ మాటే అన్నాను. ఔనురా చంటీ దాని మాటే మరిచిపోయాను. కత్తిపీట లేకుంటే నా

## బికినీ వద్దన్న నయనతార!!

1978లో అమితాబ్ బచ్చన్ హీరోగా 'డాన్' చిత్రం ఏ ముహూర్తాన విడుదలయ్యిందో గాని దానికి రీమేక్‌ల పర్వం ఇంకా కొనసాగుతూనే ఉంది. దాని మొదటి రీమేక్ తెలుగులో ఎన్.టి.ఆర్ హీరోగా నటించిన 'యుగంధర్', తర్వాత తమిళంలో రజనీకాంత్ హీరోగా నటించిన 'బిల్లా', తర్వాత మళయాళంలో మోహన్ లాల్ హీరోగా నటించిన 'శోభరాజ్'. ఇవన్నీ ఘన విజయం సాధించిన చిత్రాలే. ఇది మొదటి విడత రీమేక్‌ల పర్వం. ఇక ఇప్పుడు రెండో విడత రీమేక్‌ల పర్వం మొదలైంది. 2006లో ఫరాన్ అక్తర్ పాత 'డాన్'కు కొత్త ట్విస్టు ఇచ్చి మరో డాన్ నిర్మించాడు. ఇది ఆశించిన మేరకు విజయం సాధించలేక పోయింది. తర్వాత తమిళంలో రజనీకాంత్ 'బిల్లా'కు రీమేక్‌గా గత సంవత్సరం అజిత్ హీరోగా మరో 'బిల్లా' విడుదలైంది. ఇందులో కథా బలానికి, నమిత అందాలు, నయన తార బికినీలో నటించిన దృశ్యాలు కూడా తోడవడంతో సంచలనం విజయం సాధించింది. ఇక మిగిలింది 1979 లో ఎన్.టి.ఆర్ హీరోగా నటించిన తెలుగు 'యుగంధర్'. ఇప్పుడు దీన్ని ప్రభాస్ హీరోగా పునర్నిర్మిస్తున్నారు. తమిళంలో నయన తార బికినీ దృశ్యాలు సృష్టించిన సంచలనం దృష్టిలో పెట్టుకుని ఇందులో కూడా ఆమెను బికినీలో నటించమని కోరాడట ప్రభాస్. అయితే 'గోల్డెన్ యాక్షన్స్ ఆర్ నెవర్ రిపీటెడ్' (గొప్ప పనులు పునరావృతం కావు) అన్న ఇంగ్లీషు సామెతను చెప్పి సున్నితంగా తిరస్కరించిందట నయనతార!

ప్రయాణం ఆగిపోతుంది. కంసాలి వాడికి చెప్తే నాలుగురోజులాగమంటాడు. ఇప్పుడేం చేయనురా? తల పట్టుకుంది నాయనమ్మ.

నేను ఆలోచించాను. ఇంట్లో కత్తిపీట వుంది. దాన్ని తీసుకుపో. ఊహూ లాభం లేదు. అది చాలా పెద్దది. పైగా ఆ కత్తిపీట లేకపోతే మీ అమ్మకు ఇబ్బంది అంది. ఆ మాట నిజమే! మా అమ్మ నన్నెప్పుడూ బుద్ధిలేని వెధవా, మొద్దు రాచిప్పా అంటుంది. కానీ నేనూ తెలివైనవాడిని, చురుకైన వాడిని అని నా నమ్మకం. నా బుర్రలో చటుక్కున ఒక్క మెరుపు మెరిసింది. నాయనమ్మా! మన అటక మీద ఓ చిన్న కత్తిపీట చూసాను అన్నాను సంతోషంగా.

ఔనురా చంటీ! బాగా గుర్తు చేసావు. దాన్ని నా పెళ్లిలో మా పుట్టింటి వారు సారె సామానుతో పాటు ఇచ్చారు. బొత్తిగా చిన్నదయిపోయిందని మూలపడే శాను. ఒరేయ్ అటక ఎక్కి దాన్ని తియ్యరా అంది నాయనమ్మ. అటకా? నేనా? నాకు భయం. భయం దేనికిరా జామి చెట్టు ఎక్కుతున్నావా? ఈ అటక ఇంతకు ముందు నువ్వు ఎక్కలేదా? అడిగిందామె. అప్పుడు కింద నుంచి నిచ్చెనను అమ్మ పట్టుకునేది. ఒరేయ్ ఆలస్యం చెయ్యకు. మీ అమ్మ పెరట్లో పిండి రుబ్బుతోంది. నిచ్చెన నేను పట్టుకుంటాను అంది. ముసలిది వదిలేస్తుందేమోనన్న భయం. అయినా నాయనమ్మ ప్రయాణం ఆగకూడదని ఎక్కాను.

నేను కత్తి పీట కింద పడేయబోతే నాయనమ్మ వారించింది గచ్చు పోతుందని. ఒక్క చేత్తో నేను దిగలేనని అలాగే మీద కూర్చున్నాను. ఇంతలో ఆడు కోవడానికి వెళ్లిన మా చెల్లి వచ్చి నిచ్చెన పట్టుకుని నిల్చున్న నాయనమ్మను, అటక మీద నన్నూ చూసి గట్టిగా ఆ విషయం అమ్మకు అరిచి చెప్పింది. నేను అటక మీద వున్నానని తెలుసుకున్న అమ్మ, చేతులైనా కడుక్కోకుండా వచ్చి నన్ను తిట్టడం మొదలు పెట్టింది. నేను భయం భయంగా దిగి పారిపోబో తుంటే, ''అటక ఎక్కొద్దు అని చెప్పానా? ఎందుకు ఎక్కావు?'' అంటూ నన్ను చీపురుతో తరిమి కొట్టింది. అప్పుడు నాయనమ్మ చెప్పిన రహస్యం కక్కేసాను.

''అత్తయ్యా? ఈ వయసులో మీకిదేం బుద్ధి? ఒంటరిగా కాశీకి వెళదామనుకున్నారా? నయమే, తెలిసిపోయింది. దారిలో కానీ లేదా అక్కడ మీకేదైనా అయితే మాకు కబురూ కాకర కాయ వుండదు'' అంది అమ్మ కోపంగా.

నాయనమ్మ బదులు చెప్పకుండా వెళ్లి వసా రాలో నులక మంచం మీద పడుకుంది. నాయనమ్మ ప్రయాణం ఆగిపోయిందన్న విచారంతో ఆ రాత్రి నేను పుస్తకం తీస్తే ఒట్టు. రోజూలాగే ఆ రోజూ తెల్లవారింది. అమ్మ ఆ మాట చెప్పగానే ఇంట్లో అంతా పండుగ సందడి. నాయనమ్మ ముఖం చిచ్చుబుడ్డీలా వెలుగుతోంది.

''ఒరేయ్ చంటీ, పాపాయి, బుజ్జీ ఈరోజే మనం దరం కాశీకి వెళుతున్నాం'' అంది అమ్మ. ఆ రాత్రి అమ్మ నాయనమ్మ కాశీ ప్రయాణం గురించి నాన్నకు చెప్పిందట. ఇవాళ భగవంతుడు మన పట్ల వుండి, మీ అమ్మగారి ప్రయాణం బయటపడింది. నాకు నమ్మకం లేదు. మరో అదును చూసుకొని ఆవిడ వెళ్లిపోయేలాగా ఉంది అందట. నాన్నగారు ఆలోచిం చారు. తల్లి కోరిక తీర్చే సమయం వచ్చిం దనుకు న్నారు. రెండు రైళ్లు మారి మేం మొగల్ సరాయి వెళ్లే రైలెక్కాం. మొగల్‌సరాయి అంటే కాశీయేనట. దారిలో ఏవో స్టేషన్లలో అమ్మ మడిగా వంట చేసింది. తెల్లవారి అయిదుగంటలకు కాశీలో వుంటాం అన్నారు నాన్నగారు.

నాయనమ్మ రోజూ రాత్రి మూడుగంటలకే లేస్తుంది. రైల్లో ఆమె పడుకునే వుంది. అమ్మా, నాన్న రైలు దిగే ప్రయత్నాలు చేస్తున్నారు. మమ్మల్ని లేపారు. అమ్మ నాయనమ్మను లేపింది. ఆమె లేవలేదు. ''ఏమండీ! అత్తయ్యగారు ఉలకడం లేదు పలకడం లేదు'' అంటూ నాన్నకు చెప్పింది. ఆయనా కదిలించారు. నాడి చూసి ''అమ్మా!'' అంటూ ఆమె మీద పడిపోయారు.''

''అంటే, రైల్లోనే మీ నాయనమ్మ అంతిమ శ్వాస విడిచిందా?'' అన్నాడు మూర్తి.

''ఆవిడ కోరిక కోరికగానే మిగిలిపోయింది. కాశీలో ఆమె శవాన్ని దింపి అక్కడే దినవారాలు జరిపించారు నాన్న. మీరు చెప్పండి ఆమె కాశీ వెళ్లినట్లా? లేక వెళ్లనట్లా?'' అడిగాడు చలపతి.

''ఎంత పని జరిగింది? మీ నాయనమ్మ పుణ్యాత్మురాలు. కాశీలో ప్రాణాలు విడిచింది. మన పెద్దవాళ్లు ఆరోజుల్లో అనేవారు కాటికి వెళ్లినవాడు కాశీకి వెళ్లినవాడు తిరిగిరాడని..అదే నిజమైంది'' రంగనాథం అన్నాడు కళ్లు తుడుచుకుంటూ.

*

